నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 9 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



బస్తీవాసులతో మాట్లాడుతున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ఎమ్మెల్యే అసమర్థతతోనే కరంటు కష్టాలు

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జనవరి 8 : ఎమ్మెల్యే గడ్డం వినోద్ అసమర్థతతోనే బెల్లంపల్లిలో కరంటు కష్టాలు మొదలయ్యాయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. సింగరేణి యాజమాన్యం విద్యుత్ సరఫరా నిలివివేసిన పట్టణంలోని 15వ వార్డులో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. తమ ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని దుర్గం చిన్నయ్య వారికి తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో బెల్లంపల్లిలో నివసించే కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు క్వార్టర్లను సొంతం చేసినట్లు గుర్తు చేశారు. గతంలో కార్మికుల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలివివేసిన ఘటనలు లేవని స్పష్టం చేశారు. కార్మికులు, ప్రజలు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారంలో మగ్గుతుంటే అధికార పార్టీ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్ లేకుండా ప్రజలు నరకయాతన పడుతుంటే చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సందర్శించారు. స్టాళ్ల వద్ద కూరగాయలు విక్రయిస్తున్న తీరును ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఎలాంటి సమస్య వచ్చినా తనకు సమాచారం అందించాలని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, నాయకులు అరుణ్, లావణ్య, అలీ, కలీం, మౌనిక్, శేఖర్, సుందర్‌రావు, కొమురయ్య, సత్యనారాయణ, మల్లయ్య, సురేష్, చరణ్,శ్రీను, సతీశ్, మహేశ్ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

చెక్కును అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 8 : మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన ముక్సుద్ కుటుంబానికి బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రూ.8.60 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, ఎస్పీ కార్యాలయ ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ్ శంకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వర్మ ఉన్నారు.

ఆరుగాలం

కష్టపడి పంట తీసిన రైతన్నలను అడుగడుగునా నిలువుదోపిడీ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులే దళారుల అవతారమెత్తి తక్కువ ధరకు సన్నరకం వడ్లు కొని.. ఆపై బినామీల పేరిట ప్రభుత్వానికి అమ్మి బోనస్‌ను స్వాహా చేస్తున్నారు. అన్నదాతల వద్ద క్వింటాల్‌కు రూ. 2,650 చొప్పున కొనుగోలు చేసి.. ఆ తర్వాత కర్షకులే అమ్మినట్లుగా ట్రక్ షీట్‌లు సృష్టించి రూ. 2,820 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

- దండేపల్లి, జనవరి 8

ఇటీవల ధాన్యం లోడ్‌తో పట్టుబడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న లారీ

బోనస్ స్వాహా

దళారుల అవతారమెత్తిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు

- రైతుల వద్ద క్వింటాలుకు రూ.2600 చొప్పున కొనుగోలు..
- ఆపై కర్షకులే అమ్మినట్లు ట్రక్ షీట్‌లు సృష్టించి 'మద్దతు' మింగేస్తున్న వైనం
- నిండామునుగుతున్న అన్నదాతలు
- ఇటీవల గూడెం చెక్‌పోస్ట్ వద్ద లారీ పట్టుబడడంతో వెలుగుచూసిన బాగోతం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కడెం, గూడెం ఆయకట్టు పరిధిలోని రైతులు ఎక్కువగా సన్న రకాన్ని సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడవడంతో కొనుగోళ్లలో జాప్యమైంది. ఇదే అదనుగా భావించిన దళారులు రింగ్‌గా ఏర్పడి సన్న రకాల ధరలను తగ్గించేశారు. దీంతో రైతులు ప్రభుత్వం ఇస్తున్న బోనస్ ఆశతో మద్దతు ధర వస్తుందనుకొని కొనుగోలు కేంద్రాల బాట పట్టారు. కొందరు కేంద్రాల నిర్వాహకులు దళారుల రూపంలో అక్కడే ఉండడంతో రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల్లో దళారులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి.. ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల పేరిట మిల్లులకు తరలిస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. దళారులు రైతుల వద్ద నుంచి సన్న రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,650 చెల్లించి ప్రభుత్వ నుంచి వచ్చే మద్దతు ధరను లాగేసుకుంటున్నారు. ఇప్పటికే ఇలా బినామీల పేరిట ప్రభుత్వానికి అధిక మొత్తంలో ధాన్యం అమ్మినట్లు తెలుస్తున్నది.

ఇలా చేస్తున్నారు

దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని కొందరు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారీ అవతారం ఎత్తి రైతుల నుంచి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసి.. ఆపై వారి బంధువుల పేరిట ట్రక్ షీట్‌లు రాసి పంపిస్తున్నట్లు తెలుస్తున్నది. రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి క్వింటాలుకు రూ. 150 చొప్పున లాభం అర్జిస్తున్నారు. ఒక లారీలో దాదాపు 300 క్వింటాళ్ల వరకు మిల్లుకు చేరితే రూ.45 వేల వరకు జేబులు నింపుకుంటున్నారు. మరికొన్ని చోట్ల రైతుల అకౌంట్లలోకి క్వింటాల్‌కు సరిపడా డబ్బులు జమచేసి.. తర్వాత తమ అకౌంట్లలోకి జమ చేసుకుంటున్నారు. ప్రభుత్వం బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.2,820 డబ్బులు ఇస్తుంది. అయితే గ్రామాల్లో దళారులు క్వింటాలుకు రూ.2600 చొప్పున కొనుగోలు చేసి కేంద్రాల నిర్వాహకులతో మిలాఖత్ అవుతూ నిండా దోచుకుంటున్నారు. దండేపల్లి మండలంలోని గూడెం వద్ద పట్టుబడ్డ లారీని అధికారులు తనిఖీ చేయగా విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. లారీలో 70 కిలోల బరువు గల 295 సన్న రకం వరి ధాన్యం బస్తాలతో పాటు సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించిన 570 ఖాళీ గన్ని సంచులు లభ్యమయ్యాయి. 70 కిలోల సంచుల్లోని వరి ధాన్యాన్ని రైస్‌మిల్లుకు చేరవేసి అక్కడే సివిల్ సప్లయ్‌కు సంబంధించిన ఖాళీ గన్ని సంచుల్లో నింపి సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం అందించే రూ.500 బోనస్‌ను రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన మధ్యవర్తులు, సెంటర్ నిర్వాహకులు నొక్కేస్తున్నారు. పాతమామిడిపెల్లిలో ధాన్యాన్ని తరలించేందుకు గ్రామపంచాయతీ నుంచి ఇచ్చిన ఫాం నంబర్-10లో గ్రామ ప్రత్యేకాధికారి అయిన తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడం గమనార్హం. అధికారులకు అందిన సమాచారం మేరకు ఈ నెల 3న గూడెం చెక్‌పోస్ట్ వద్ద ధాన్యం తరలిస్తున్న లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాతమామిడిపెల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి కొనుగోలు చేసినట్లు ట్రక్ షీట్ రాసుకోగా, పట్టుకున్న లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేంద్రం నిర్వాహకులు, దళారులపై కేసులు నమోదు చేశారు. ఈ దందాపై ఇకనైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కోసం బినామీల పేరిట మిల్లులకు తరలిస్తున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఇప్పటివరకు ఇలాంటి ఘటనలు జరగలేదు. ఎవరైనా సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తాం.

- విజయ, డిప్యూటీ తహసీల్దార్

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి

నస్పూర్, జనవరి 8 : మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులోగల అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అల్ఫోర్స్ మంచిర్యాల జోనల్ ఇన్‌చార్జి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాపన్‌పేటలో బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్, జనవరి 8 : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మారుమూల గ్రామం పాపన్‌పేటలో యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉంటే ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ జిల్లా కో కన్వీనర్ కొండా రాంప్రసాద్, సీనియర్ నాయకుడు ఖాఖా మోహినుద్దీన్, నాయకులు సలీం, రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బూస సారయ్య, నాయకులు రౌతు బాపురావ్, దుర్గం తిరుపతి, సప్తగిరి, బుజాడి సుధాకర్, దన్నారి శ్రీకాంత్, శశికిరణ్, ఆత్రం వెంకటేశ్, హరీశ్ పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో..

చింతలమానేపల్లి, జనవరి 8 : రవీంద్రనగర్-1 ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో యువకులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు శివ బిస్వాస్, అనుపమ్ దాస్, దీపక్ గోల్దార్, హరిదాస్ మండల్, సంపత్, సుమిత్, బాల, ఆదిత్య దాస్, రాకేశ్, మోహన్, మండల్, అశోక్ మండల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కన్నెపల్లి, జనవరి 7 : సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కన్నెపల్లి, అయితపల్లి, సాలిగాం గ్రామాలను సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సాలిగాం గ్రామం నుంచి నాయకునిపేట వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, నల్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. సాలిగాం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

బస్ వచ్చింది

- జనగామ రూట్‌లో ప్రారంభం
- ఆనందంలో పది గ్రామాల ప్రజలు.. పలుచోట్ల ఘన స్వాగతం
- 'నమస్తే'కు కృతజ్ఞతలు

కోటపల్లి, జనవరి 8 : మండలంలోని జనగామ రూట్‌లో బుధవారం ఆర్టీసీ బస్ ప్రారంభమైంది. పది గ్రామాలకు పది నెలలుగా ఆర్టీసీ బస్ రాకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ' పలు కథనాలు ప్రచురించింది. గత నవంబర్ 4న 'ఎమ్మెల్యే గారూ మాకూ మహాలక్ష్మీ కావాలి' శీర్షికన కథనం ప్రచురితం చేసింది. అయినా అధికారులు స్పందించలేదు. అదే నెల 21న జనగామ, ఆలుగామ మాజీ సర్పంచ్‌లు గట్టు లక్ష్మణ్ గౌడ్, కుమ్మరి సంతోష్, రాజారం మాజీ ఎంపీటీసీ జేక శేఖర్ ఆధ్వర్యంలో చెన్నూర్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. అయినా బస్సు పున:రుద్ధరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 15న 'నమస్తే తెలంగాణ'లో 'ఎమ్మెల్యేకు చెప్పినా బస్సు వస్తలే' శీర్షికన మరో కథనాన్ని ప్రచురించింది. సమస్య చిన్నదైనా పరిష్కారం కాకపోవడంతో పారుపల్లి, లింగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, జనగామ, నందరాంపల్లి, సూపాక గ్రామాల ప్రజలు ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. అలాగే కోటపల్లి మండలానికి చెందిన మంత్రి రామయ్య కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఇక డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఒక అడుగు ముందుకేసి జనగామ రూట్‌లో బస్సు సేవలను పున: రుద్ధరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా బస్సు సేవలు ప్రారంభం కాలేదు. ఇక మరోసారి ఈ నెల 5న 'నమస్తే తెలంగాణ' 'అసెంబ్లీలో మాట్లాడినా బస్సు రాలే' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. వరుస కథనాల నేపథ్యంలో ఎమ్మెల్యేతో పాటు అధికారులపై ఒత్తిడి పెరిగింది. దీంతో చివరగా బుధవారం చెన్నూర్ నుంచి జనగామ వరకు బస్సును ప్రారంభించారు. చాలా రోజుల తర్వాత జనగామ రూట్‌లో బస్సు ప్రారంభం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బస్సుకు ఘన స్వాగతం పలికారు. కాగా, 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించడం.. బస్సు సేవలు తిరిగి ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నమస్తే తెలంగాణ
ఎమ్మెల్యే గారూ.. మాకూ మహాలక్ష్మి కావాలి

నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

జనగామ గ్రామానికి వచ్చిన బస్సుకు స్వాగతం పలుకుతున్న మాజీ సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్, గ్రామస్తులు

ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ కరుణాకర్

డీసీఆర్బీ డీఎస్పీగా కరుణాకర్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 8 : డీసీఆర్బీ డీఎస్పీ, ఫంక్షనల్ వర్టికల్ ఇన్‌చార్జి డీఎస్పీగా కరుణాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుల మొక్క అందజేశారు. ఇటీవల బదిలీలల్లో డీజీ కార్యాలయానికి అటాచ్ చేయగా.. తాజాగా డీసీఆర్బీ డీఎస్పీగా కరుణాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జన్నారం, జనవరి 8 : మల్యాలలోని ఐటీడీఏ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అజ్మీర లక్ష్మణ్‌నాయక్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విధులకు నిర్లక్ష్యం చేయడంతో పాటు పాఠశాలకు గైర్హాజరవడం లేదని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెన్షన్ చేసినట్లు మంచిర్యాల ఇన్‌చార్జి డీటీడీవో జాదవ్ అంబాజీ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కాగజ్‌నగర్, జనవరి 8 : మూత్రశాలల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని రాజీవ్ గాంధీచౌరస్తా వద్ద ఎన్ఎస్ క్లీన్ అండ్ గ్రీన్ సేవా సంతన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాన్ని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచడంలో భాగంగా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి ప్రారంభించేందుకు సిద్ధం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం నజ్రుల్‌నగర్‌లో సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

సింగరేణికి స్పెషల్ క్యాంపెయిన్ 4.0 పురస్కారం

కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి నుంచి అవార్డు అందుకున్న సీఎండీ బలరాం

సీసీసీ నస్పూర్, జనవరి 8: పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ.. అత్యధిక ప్రదేశాలను శుభ్రం చేసినందుకుగాను సింగరేణి కాలరీస్‌కు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన(మ్యాగ్జిమమ్ నంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్) విభాగంలో సింగరేణికి అవార్డు వరించింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఢిల్లీలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరాం ఈ అవార్డును అందుకున్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోలిండియా, అనుబంధ సంస్థలు, నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో గతేడాది అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెయిన్ 4.0 పేరిట స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాయి. ఇందులో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 157 చోట్ల పరిసరాలను శుభ్రం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో అత్యధిక సంఖ్యలో ప్రదేశాలను శుభ్రపరిచినందుకుగాను సింగరేణికి ఈ పురస్కారం లభించింది. సింగరేణి చేపట్టిన ఈ పరిశుభ్రత కార్యక్రమానికి గుర్తింపు లభించడంపై సంస్థ సీఎండీ బలరాం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్, అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితాతేజ్, సింగరేణి జీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం